# గోడకూలి ఒకరు మృతి

### ఇద్దరికి గాయాలు



లంగర్‌హౌస్ హాషం నగర్‌లో కూలిన గోడ

మెహిదీపట్నం, మార్చి 24, ప్రభాతవార్త : కూలి పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు పక్కనే ఉండి పని చేస్తున్న స్థానిక నాయకునిపై ప్రమాదవశాత్తు గోడకూలడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన లంగరహౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గార్ల మండల్‌కు చెందిన అప్పన్న, కామయ్యలు అత్తాపూర్ 120 పిల్లర్ నెంబర్ వద్ద నివాసం ఉంటూ దినసరి కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. లంగర్‌హౌస్ డివిజన్ హాషం నగర్‌లోని ఇఫ్తాకార్ ఇంటి వద్ద పని ఉందని స్థానిక నాయకుడైన మహబూబ్‌పాషా వీరిద్దరిని తీసుకెళ్లాడు. పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్నటువంటి గోడకూలడంతో కామయ్య సంఘటనా స్థలంలోనే చనిపోగా అప్పన్న, మహబూబ్‌పాషాలకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నేత్రపర్వంగా చిన్నారి నర్తకీమణుల నృత్యార్పణం



చిన్నారి నర్తకీమణుల నృత్యార్పణంలో ఓ దృశ్యం

నాంపల్లి, మార్చి 24 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సమృద్ధి స్కూల్ ఆఫ్ డ్యాన్స్, కళింగ కల్చరల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంగీత చంద్రశేఖర్ నట్టువాంగం, రేణుకా ప్రసాద్ మృదంగం, చందర్‌రావు వయోలిన్‌తో వాద్య సహకారం అందించగా నిర్వహణ సంస్థలకు చెందిన 39మంది చిన్నారి నర్తకీమణులు ముందుగా రంగపూజ, రామపట్టాభిషేకం, జతిస్వరం, దేవదేవం భజే, తులజ రాజేంద్రశబ్ధం, అలరులు కురియగ, శంభో మహదేవ, బాలగోపాల తరంగం తదితర అంశాలతో చూడచక్కని హావభావాలు, ముఖ కవళికలు, పదవిన్యాసం, శృతి లయబద్ధమైన అభినయం, అద్భుత ఆహార్యాలతో నాట్యవిన్యాసాన్ని రసరంజకం, జనరంజకంగా నృత్యార్పణం కావించి ఆహుతులను తన్మయుల్ని చేసి మంత్రముగ్ధులను గావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ అతిథులు చిన్నారి నర్తకీమణులను ఎంతగానో అభినందించి శుభాశీస్సులు అందించారు.

# ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



నార్సింగి, మార్చి 24 ప్రభాతవార్త : పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. విషాదకరమైన ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మంచిరేవుల గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీరాములు కుండలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు సాయితేజ(16) లంగర్‌హౌస్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం తన తల్లి, సోదరితో కలిసి మంచిరేవుల చౌరస్తాలో కుండలు పెట్టి విక్రయించాడు. కొంత సమయం తరువాత కుండలు తీసుకు వచ్చేందుకని వెళ్లి తిరిగి రాలేదు. సోదరి అనుసూయ తమ్ముడి కోసం ఇంటికి వెళ్లి చూడగా దూలానికి ఉరేసుకొని కనిపించాడు. ఈ దృశ్యాన్ని చూసిన అనుసూయ షాక్‌తో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. అందరూ కలిసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు ధృవీకరించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్నారు.

## పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

చార్మినార్, మార్చి 24 ప్రభాతవార్త : ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని చార్మినార్ జోన్ ఉప విద్యాశాఖాధికారి ఐ.నెహ్రూబాబు తెలిపారు. చార్మినార్ జోన్ ఉప విద్యాశాఖాధికారి నెహ్రూ బాబు శుక్రవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ చార్మినార్ జోన్ పరిధిలో పదవ తరగతి పరీక్షలకు దాదాపు 3,102 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే బాల, బాలికలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతీరోజు ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, విద్యార్థులు ముప్పై నిమిషాలు పాటు ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన కోరారు. చార్మినార్ జోన్ పరిధిలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కోసం 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అదే విధంగా 26 పరీక్షా కేంద్రాలలో 26 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 26 మంది డిపార్టుమెంట్ అధికారులు, నాలుగు మంది కస్టోడియన్లు, 300 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారని చార్మినార్ జోన్ ఉప విద్యాశాఖధికారి నెహ్రూ బాబు తెలియజేశారు.

# విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

- భారీగా ట్రాఫిక్ జామ్
- ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిన జనం
- భారీగా నిలిచిపోయిన వాహనాలు





హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : విద్యుత్ సౌధ ముందు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం నగరంలో మహాధర్నాకు దిగారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జెఏసి ఇచ్చిన "ఛలో విద్యుత్ సౌధ" పిలుపునకు ఉద్యోగుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. ధర్నాలో సుమారు 30వేల మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు. ఇసుకేస్తే రాలనంతగా విద్యుత్‌సౌధ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. వేతన సవరణ, ఆర్టిజన్ సమస్యలు, ఈపీఎఫ్ స్థానంలో జీపిఎఫ్ అమలు చేయాలని తదితర సమస్యలతో పాటు 29 డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు వివిధ జిల్లాల నుంచి భారీగా ఉద్యోగులు తరలివచ్చారు. దీంతో విద్యుత్ సౌదా పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఈ క్రమంలో ఖైరతా బాద్, పం జాగుట్ట మార్గం మూసివేశారు. 4కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపో యింది. ఖైరతాబాద్-పంజాగుట్ట-అమీర్‌పేట, సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్డు, ఖైరతా బాద్ ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర రహదారులపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు వెల్లువెత్తాయి. ఉద్యోగుల ధర్నాకు పలు రాజకీయ పార్టీలు సైతం మద్దతు తెలిపాయి.

# మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య



భైరి రవికుమార్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, మార్చి24 ప్రభాతవార్త: ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భైరి రవికుమార్(55) హైటెన్షన్ లైన్‌లోని రామ్‌చంద్ర హోమ్స్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటూ గ్రానైట్ వ్యాపారం చేసుకుంటున్నాడు. గత కొన్ని రోజుల నుంచి బిజినెస్‌లో నష్టాలు రావడంతో చేతిలో డబ్బులు లేక మనస్థాపం చెంది మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రవికుమార్, భార్య త్రిసంధ్యారాణి, కుమారుడితో కలిసి ఈనెల 23న ఎస్ఆర్ నగర్‌లోని తన బంధువుల ఇంటి వేడుకకు వెళ్ళి అదే రోజు రాత్రి ఇంటికి తిరిగి వచ్చి ఎవరి గదిలో వారు పడుకున్నారు. గెస్ట్ రూమ్‌లో పడుకున్న రవికుమార్‌ను ఉదయం వాకింగ్ వెళ్ళడానికి కుటుంబ సభ్యులు తలుపు తట్టినా ఎంత సేపటికి తీయడంలేదని వారి వద్ద ఉన్న తాళం చెవితో తలుపులు తీయగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడు కనిపించాడు. వెంటనే రవికుమార్‌ను కిందికి దింపి సమీపంలోని ఆసుపత్రి తరలించగా పరీక్షించి వైద్యులు అప్పటికే మృతిచెందాడని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ విషయమై కుటుంబ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

# పడగ విప్పుతున్న క్యాన్సర్

**గుండెపోటు తర్వాత స్థానం క్యాన్సర్‌దే ❁ కాస్త ఆలోచించకపోతే ప్రమాదకర వ్యాధి రావొచ్చు**



**ఆలస్యంతోనే అధిక మరణాలు..** హెపటైటీస్ బీ, సీలు కాలేయ క్యాన్సర్‌లకు, హ్యూమన్ పాసిలోమా వైరస్(హె చ్‌పీవీ) గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రావడానికి కారణమవుతున్నాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు టీకా అందుబాటులో ఉంది. 8 నుండి 18 ఏళ్ళ వయస్సు వారికి దీన్ని ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. కాలేయ క్యాన్సర్‌కు హెపటైటీస్ టీకా ఉంది. 40 ఏళ్ళు దాటిన మహిళ ఏడాదికోసారి మామోగ్రఫీ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. అత్యధికుల్లో క్యాన్సర్‌ను గుర్తించడమే ఆలస్యమవుతోంది. దాంతో అప్పటికే ముదిరిపోయి మరణాలకు దారితీస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో విస్తృతంగా క్యాన్సర్ ముందస్తు పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌కు ప్రధాన కారణాలలో సిగరెట్, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తుల వాడకంతో పాటు మితిమీరిన మద్యపానం, ఊబకాయం, వేపుళ్ళు, నిల్వ ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, అధిక ఒత్తిడి, తీవ్ర నిద్రలేమిఅని వైద్యులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : నగరంలో క్యాన్సర్ పడగ విప్పుతోంది. అభివృద్ధి చెందుతున్న సమాజంలో క్యాన్సర్ కల్లోలం సృష్టిస్తోంది. రోగనిరోధక శక్తి తగ్గేకొద్దీ క్యాన్సర్ విస్తరణ వేగమూ అదేస్థాయిలో పెరుగుతోంది. క్యాన్సర్ బారినపడ్డ తరువాత చికిత్స చేయడంకన్నా అది దరికిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే అత్యుత్తమమైన పని. జీవన పరిస్థితులు, వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలి వంటివి ఆరోగ్యంపై ప్రభావం కనబరుస్తాయి. క్యాన్సర్ ముందుగా గుర్తించడం సాధ్యంకాదని ఇప్పటికే చాలామంది అపోహపడుతుంటారు. అది ఎంతమాత్రమూ నిజం కాదని వైద్యులు పేర్కొంటున్నారు. చాలా రకాల క్యాన్సర్లను తొలిదశలోన్లనే పసిగట్టవచ్చు. ప్రజల్లో అవగాహన పెరగడం నేటి తక్షణావసరం. కొన్ని రకాల క్యాన్సర్లను మాత్రం తొలిదశలోనే గుర్తించడం కుదరదు. రొమ్ము, గర్భాశయ, చర్మ, నోటి, పేగు సంబంధ క్యాన్సర్లను చాలా మందు గానే గుర్తించడం సాధ్యమవుతుంది. లక్షణాల ప్రాతిపదికన ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స సులభమవుతుంది. మద్యపానం, పొగాకు సేవన నం వంటి అలవాట్ల వల్ల కలిగే దుష్ఫలితాలను విరివిగా ప్రచారం చేయడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవశ్యకత పట్ల అవగాహన పెంచితే క్యాన్సర్‌ను చాలా వరకు నిరోధించవచ్చు. ఊపరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 71 శాతం ధూమపానం అలవాటు ఉన్న వాళ్లే. క్యాన్సర్ మరణాల్లో 22 శాతానికి పొగాకు సేవనమే కారణమవుతోంది. గుట్కా, పాన్ మసాలాలు, తంబాకు లాంటి వాటిని విచ్చలవిడిగా నమలడం.. గంటల తరబడి నోట్లో పెట్టుకోవడంతో చాలా మందికి నోట్లో తీవ్రమైన అస్సర్లు కన్పిస్తున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయడంతో 2-5 ఏళ్లలో నోటి, హెడ్ అండ్ నెక్ క్యార్సర్ల కింద రూపాంతరం చెందే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవగాహన లేమితో పొగాకు ఉత్పత్తులను వాడుతూ వారికి తెలియకుండానే బానిసలవుతున్నారు. ముఖ్యంగా బాధితుల్లో అధిక శాతం యువత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో 40 శాతం నోటి, హెడ్‌అండ్ నెక్‌లతో బాధపడుతున్నారని అక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. యువత ఎక్కువ మంది గుట్కా, పాన్ మసాలాలు, జర్దా లాంటి వాటిని అధికంగా తీసుకుంటున్నారు. తక్షణం ఇలాంటి వాటిని మానేయడం చాలా మంచిదని, నోట్లో దీర్ఘకాలంగా పుండ్లు, తెల్లమచ్చలు లాంటివి ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నోరు తెరవడం, గుటక వేయడం కష్టంగా ఉండటం, ఆహారం తీసుకుంటే మింగనివ్వకపోవడం, గొంతు బొంగురు పోవడం లాంటి లక్షణాలు కన్పిస్తే తక్షణం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలంటున్నారు. ముందే గుర్తించడంతో నోటి క్యాన్సర్లను పూర్తిగా నివారిం చవచ్చు. చాలా మంది 2-3 దశలు దాటిన తర్వాత చికిత్సకు వస్తు న్నారని, ఇలాంటి సమయాల్లో నియంత్రణ అనేది కష్టమని చెబుతున్నారు. సుదీర్ఘంగా పిప్పి పళ్లతో నోటి గోడలకు ఇన్‌ఫెక్షన్లు లాంటివి వస్తే అశ్రద్ధ చేయకూడదని వైద్యులు పేర్కొంటున్నారు. ఏటా ఈ మహమ్మారి కేసులు, మరణాలు చాప కింత నీరులా పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చుతు న్నారు. గాడితప్పిన జీవనశైలి కారణంగా కేసులు పెద్ద ఎత్తున నమోదవుతు న్నాయని వివరిస్తున్నారు.

**30ఏళ్ళ వారిని వదలని మహమ్మారి..** ప్రపంచంలో మరణాలకు దారితీసే అతి ముఖ్య కారణాల్లో గుండెపోటు తర్వాతి స్థానం క్యాన్సర్‌దే. గతంలో 50 ఏళ్ళు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం 30ఏళ్ళ వారిని వెన్నాడుతోంది. 30 నుండి 40 ఏళ్ళ వయస్సులో ఏటా 10శాతం కేసులు పెరుగుతుండటం ఆందోళన చెందాల్సిన అంశమే. దీని నివారణకు చర్యలు తీసుకోకుంటే 2025 నాటికి మొదటి స్థానానికి ఎగబాకే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. మన దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారక వైరస్ పెళ్ళీడు కొచ్చిన మహిళలందరిలోనూ ఉంటుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. ముందే కనిపెట్టగలిగితే థర్మల్ క్రయోథెరఫీ వంటి సులువైన పద్ధతుల్లో నయం చేయవచ్చు. రొమ్ములో క్యాన్సర్ కణితిగా రూపాంతరం చెందడానికి మున్నాలుగేళ్ళు పడుతుంది. ఈ సమయంలో కనిపెట్టగలిగితే చికిత్స సులువవు తుంది. క్యాన్సర్ లక్షణాలను ముంగా గుర్తించడంతో అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలో పూర్తిగా నయం చేయడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

## సందేశాత్మకంగా రసరంజని వార్షిక నాటకోత్సవాలు

### తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, మార్చి 24 ప్రభాతవార్త : ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రసరంజని 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈ నెల 26 నుండి 28వరకు 3రోజులపాటు సమాజహిత సందేశాత్మక నటకాలను రసరంజని నాటకోత్సవం పేరిట ప్రదర్శించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, రసరంజని అధ్యక్షులు డా. కె.వి.రమణాచారి తెలిపారు. తెలుగు నాటక వికాసానికి బహుముఖంగా తోడ్పడాలన్న ఆశయంతో రసరంజని సంస్థ కన్యాశుల్కం నాటక ప్రదర్శనతో 1993 మార్చి 8న టిక్కెట్ కొని నాటకాన్ని చూడాలన్న సంప్రదాయాన్ని ప్రోదికొల్పుతూ కేవలం 10రూపాయల ప్రవేశ రుసుముతో ప్రతీనెల నాటక ప్రదర్శనను ప్రారంభించి ఇప్పటికి 30 వసంతాలుగా అదే ధ్యేయం, లక్ష్యంతో అవిరళకృషిచేస్తూ ప్రతీయేటా వార్షికోత్సవ వేడుకలను నాటకోత్సవం పేరిట వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు, అంతేకాక బహుభాషా నాటకోత్సవాలు, నటశిక్షణా, మూకాభినయ శిక్షణా కార్యక్రమాలతోపాటు గత సంవత్సరం 5రోజులపాటు రచయితల శిక్షణా శిబిరం తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించామని, అలాగే మార్చి వార్షిక నాటకోత్సవం సందర్భంగా నాటకరంగంలో కొత్తగా ఒక 'యువ పురస్కారం' ప్రతీయేటా ఇచ్చేలా ప్రవేశపెట్టామని ఆయన వివరించారు.

## ఘనంగా శాస్త్రీయ సంగీత నీరాజనం

రవీంద్రభారతి, మార్చి 24 ప్రభాతవార్త : ప్రముఖ సంగీత చూడామణి, సప్తగిరి సంగీత విద్వన్మణి, విదూషి బి.లలిత స్మృత్యర్థం రవీంద్రభారతిలో హైదరాబాద్ సిస్టర్స్ శిష్యబృందం హేమవతి, శారద, అరుణ, పద్మ, చంద్రభాను, తేజస్విని, శ్యామ్‌కుమార్, సుధాకర్, శ్రీనివాస్‌లచే గాయత్రిశివాని-వయోలిన్, రామకృష్ణ-మృదంగం, జనార్ధన్-ఘట్టం వాద్యసహకారంతో బి.హరిప్రియ ఆధ్వర్యంలో మాతే మలయధ్వజ, దేవీబ్రోవ సమయమిదే, పాలయమాం రుక్మిణీ నాయక, శ్రీసుబ్రహ్మణ్యాయ నమస్తే, వట్టిమోపు, తిల్లానా, మాటిమాటికి తదితర కృతులు/కీర్తనలతో; ప్రత్యేకంగా చెన్నై నుండి విచ్చేసిన అక్కరై సోదరీమణులు విదూషి శుభలక్ష్మి, స్వర్ణలతలు విద్యాన్ విఠల్‌రంగన్-వయోలిన్, ఢిల్లీసాయి రామ్-మృదంగం, డా. ఎస్.కార్తీక్-ఘట్టంతో వాద్యసహకారం అందించగా రావే హిమగిరి కుమారి, సరసీరుహాసనప్రియే, చారయ్య వేంకటరమణల కృతులు, కీర్తనలతో గాత్రకచ్చేరీలతో బి.లలితకు ఘన నివాళులర్పించారు.

## నకిలీ మెహాందీ తయారు చేస్తున్న ఇద్దరు అరెస్టు



పట్టుబడిన నిందితులు

బేగంబజార్, మార్చి 24 ప్రభాతవార్త: గత కొద్ది రోజుల నుంచి ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఓ కంపెనీకి చెందిన మెహందీని తయారు చేస్తూ బేగంబజార్ పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్ఐ నరేందర్ కథనం ప్రకారం.. బేగంబజార్ ఫీల్‌ఖానా ప్రాంతానికి చెందిన ముఖేష్‌కుమార్ అయూహినా కంపెనీ పేరిట మెహందీ హెయిర్ కలర్ అమ్మకాలు చేస్తున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఫీల్‌ఖానా ప్రాంతానికి చెందిన సుఖ్‌దేవ్ అతని కుమారుడు రాకేష్ కుమావత్‌లు అయూహినా పేరిట నకిలీ మెహందీని తయారు చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్నారు. ఈవిషయం తెలుసుకున్న కంపెనీ యాజమాని ముఖేష్‌కుమార్ స్థానిక బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సుఖ్‌దేవ్, అతని కుమారుడు రాకేష్‌కుమా వత్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఫీల్‌ఖానా బగ్చీకాంప్లెక్స్‌లో రెండవ అంతస్థులో నకిలీ మెహందీ తయారు చేస్తున్న ఇరువురికి అదుపులోకి తీసుకుని వారిపై 420/63,65కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద ఉన్న నకిలీ మెహందీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును బేగంబజార్ ఇన్స్‌పెక్టర్ ఎన్.శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుద్యోగుల జీవితాలను ఆగం చేస్తున్న కెసిఆర్ ప్రభుత్వం : మాధవరం కాంతారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 24, ప్రభాతవార్త : టిఎస్‌పిఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంలో సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని అభ్యర్థులకు సత్వర న్యాయం చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజా ్ఞనం పరుగులు పెడుతున్న నేటి ఆధునిక యుగంలో తెలంగాణ రాష్ట్రంలో టిఎస్‌పిఎస్సీ పేపర్ లీకేజ్‌కి సంబంధించిన వ్యవహారం ఇప్పటికీ ఓ కొలిక్కి రాకపోవడం విచారకరమన్నారు. తెలంగాణ ఐటీశాఖ మంత్రి కెటిఆర్ పనితనానికి నిదర్శనమని లీకేజ్ వ్యవహారంలో అసలైన నిందితులను కాకుండా ప్రశ్నించిన బండి సంజయ్ కుమార్‌కి సిట్ నోటీసులు జారీ చేయడం సరికాదని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో బాధ్యులను గుర్తించి శిక్షించాలని, ప్రతిఒక్క అభ్యర్థికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే ఒక లక్ష రూపాయల నష్టపరిహారం ఖచ్చితంగా అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, రవికుమార్‌గౌడ్, నాగరాజు, వినోద్‌గౌడ్, మల్లేష్, సంతోష్, రవి, రాములు, బచల్ వినోద్, విక్కి తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ శాఖ స్థలాల పర్యవేక్షణ



కంటోన్మెంట్‌లో రక్షణ శాఖ స్థలాలను పర్యవేక్షిస్తున్న డిఫెన్స్‌ఎస్టేట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ చౌహాన్, సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పికెట్, జింఖానా గ్రౌండ్, అస్మత్ పేట్ క్వార్టర్స్‌లలో ఉన్న రక్షణ శాఖ స్థలాలను శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ డిఫెన్స్ఎస్టేట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ కె.జె.ఎస్.చౌహాన్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, డిప్యూటీ సిఈఓ విజయ్‌కుమార్ బాలన్ నాయర్, హెల్త్ సూపరిండెంట్ ఎం.దేవేందర్, ఇంజనీర్లు గోపాలక్రిష్ణదాస్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

### కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి



తహాశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద

జీడిమెట్ల, మార్చి 24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో సుమారు కోటి10లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో మాతృభూమి సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మండల తహాశిల్దార్, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను శుక్రవారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్ కార్యాలయాలకు ధీటుగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అదే విధంగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి కే సీఆర్ ధరణి పోర్టల్‌ను ప్రారంభించి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నారని కొనియాడారు. రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం దాత మాతృభూమి సంస్థ చైర్మ న్ వై.యాదగిరిరెడ్డిని మంత్రి మల్లారెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, జిల్లా కలెక్టర్ అమోఘ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నర్సింహారెడ్డి, ఎమ్మార్వో సంజీవరావు, ఆర్‌డీఓ మల్లయ్య, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సెక్రెటరీ గౌతమ్‌కుమార్, ఎమ్మార్వోలు సురేందర్, గోవర్ధన్, పద్మప్రియ, నిర్మల, కలెక్టర్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## శాంతి భద్రత పరిరక్షణలో దేశానికే ఆదర్శం: మంత్రులు



పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్, మార్చి 24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అర బిందో ఫార్మా సౌజన్యంతో సుమారు రూ.2.65 కోట్లతో మోడల్ పోలీస్ స్టేషన్‌గా రూపుదిద్దుకున్న బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను శనివారం హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిధు లుగా పాల్గొని ప్రారంభించారు. సుమారు రెండు ఎకరాల స్థలంలో 21వేల చదరపు అడు గుల విస్తీర్ణంతో జీప్లస్2 పోలీస్ స్టేషన్ భవనా న్ని ప్రారంభించడం పట్ల ప్రజా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులైన మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పోలీసులు ప్రజలతో మెరుగైన సంబంధాలు ఏర్పరచుకున్నారని, ప్రజలను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి తెలంగాణ పోలీసులు ఉన్నతమైన పాత్రను పోషించారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ పోలీసు వ్యవస్థకు అధిక ప్రాధాన్యత ను ఇస్తూ అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేయడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సురభి వాణీదేవి, నవీన్‌రావు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ మదన్ మోహన్‌రెడ్డి, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌ధన్‌రాజ్‌యాదవ్, ఎస్‌హెచ్ఓ నర్సింహారెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్ కాసాని సుధాకర్, పోలీస్ అధికారులు, బీఆర్ఎస్‌నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10 మందికి జైలుశిక్ష

చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త: చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10 మందికి వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ నాంపల్లి న్యాయస్థానం తీర్పునిచ్చింది. మరో 15 మందికి జరిమానా విధిస్తూ నాంపల్లి 4వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి తుది తీర్పును వెలువరిచినట్లు స్థానిక ట్రాఫిక్ సిఐ ధరావత్ నానూనాయక్ పేర్కొన్నారు. మొత్తం 25 మందిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం కిందకు వస్తుందని, ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

## బిఆర్ఎస్, బిజెపిల మోసపూరిత హామీలపై ఆందోళనకు సిద్ధంకండి

**రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి కొలను హనుమంతరెడ్డి**



చింతల్‌లో కాంగ్రెస్ టిపిసిసి ప్రతినిధి కొలను హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర

కుత్బుల్లాపూర్, మార్చి 24 ప్రభాతవార్త : రాష్ట్రంలో టిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలు ప్రజల్ని మోసగించేందుకు చేస్తున్న కుట్రలపై సమిష్టిగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి కొలను హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. భారత్ జోడో యాత్రలో బాగంగా చింతల్ డివిజన్ పరిధిలోని చింతల్, చంద్రానగర్ కాలనీ, శివ నగర్, సాయినగర్ కాలనీ, దుర్గయ్య నగర్, సాటిలైట్ కాలనీ తదితర ప్రాంతాలలో కాంగ్రెస్ జెండాలను ఎగురవేసి గడపగడపకు హాథ్‌సే హాథ్‌జోడో అభియాన్ స్టిక్కర్లను అంటించి కరపత్రాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా దళితసేన అధ్యక్షులు అవిజె జేమ్స్, నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, పందరీ రావు, నారాయణ రెడ్డి, నాగరాజు, సంగారెడ్డి, బాలు, వార్డు సభ్యులు గణేష్, రాహుల్ మహిళ నాయకురాలు లక్ష్మిరెడ్డి, లలితల ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా కొలను హనుమంతరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించడంద్వారా వంటగ్యాస్ సిలిండరు రూ.లు. 500లకే అందుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులకు ఫీజు రిహంబర్స్‌మెంట్, రైతులకు వడ్డీలేని రుణాలు అందించే అవకాశం కలుగుతుందన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు వేగవంతం జరిపేందుకు చర్యలు

**దివంగత సాయన్న కుమార్తెలు నివేదిత, లాస్య నందితలు**



కార్ఖానలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న నివేదిత, లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త: కంటోన్మెంట్ కార్ఖానలో చేపట్టనున్న ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే దివంగత సాయన్న కుమార్తెలు నివేదిత, లాస్య నందితలు పరిశీలించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ ప్రజలకు తన తండ్రి సాయన్న ఎంతో సేవ చేశారని, ఆయన ఆశయాలను తాము కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నాగినేని సరిత, సదానంద్ గౌడ్, నారాయణ, భాస్కర్ ముదిరాజ్, నిత్యానంద్ పాల్గొన్నారు.

## సిపిఎం జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి : అజయ్ బాబు



అడ్డగుట్టలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విడుదల చేసిన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

అడ్డగుట్ట, మార్చి 24 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఏర్పాటు చేసిన జీప్ యాత్రను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ జోన్ సిపిఎం నాయకులు ఎం. అజయ్‌బాబు, ఆర్.మల్లేశ్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసిన జన చైతన్య యాత్ర గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.మహేందర్, ఎం.గోపాల్, మధు, నర్సయ్య, బాణయ్య, బి.వి.చారి, నర్సింగ్‌రావ్ పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి : మోహన్

అడ్డగుట్ట, మార్చి 24 ప్రభాతవార్త : ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపట్టిన జూడో యాత్రకు అనూహ్య స్పందన రావడంతో బిజెపి ప్రభుత్వం ఓర్వలేక రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ పార్టీపై కేసులు పెట్టడం సరైంది కాదని కాంగ్రెస్ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ తెలిపారు. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి వచ్చానన్నారు. ఆయన సూచనల మేరకు గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కా ంగ్రెస్ నేతలు ఆర్.సుందర్ రాజన్, రాజుల్,సత్య నారాయణ, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## 29న డిబిపి రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం, సభ

**విజయవంతం చేయాలని వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపు**



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: దళిత బహుజన పార్టీ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం, సభ ఈ నెల 29వ తేదీ ఉదయం మింట్ కంపౌండ్‌లోని స్ఫూర్తి భవన్‌లో జరుగుతుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ జనరల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 29న జరిగే సమావేశంలో నేషనల్ డెమాక్రటిక్ సెక్యులర్ ఫ్రంట్ ముఖ్యసలహాదారు ప్రొఫెసర్ వి.ఎల్.రాజు, పార్టీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌భాషా, నాయకులు సిలివేరు వసంతరావు, దేవునూరి శ్రీనివాసు, ఇటికాల గణేష్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ, సిఎం కెసిఆర్ కార్పొరేట్ మాఫియా దోపిడి మనువాద పాలనకు ప్రజలు చరమ గీతం పడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో లిక్కర్, ల్యాండ్, సాండ్ క్రిమినల్ మాఫియా దోపిడి కులాల మనువాద రాజకీయాలను ఓడించాలని దళిత బహుజన పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. దళిత బహుజనులకు రక్షణ, సామాజిక న్యాయం, విముక్తి జరగాలంటే అంబేద్కర్‌వాదులైన దళిత బహుజనన పార్టీ అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెపించాలని ఆయన పౌరసమాజానికి పిలుపు నిచ్చారు.

## క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

నిజాంపేట్, మార్చి 24 ప్రభాతవార్త: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని మమతా మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రజలకు టీబీపై అవగాహన కల్పిస్తూ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు క్షయ వ్యాధిని ఎలా గుర్తించాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఎలా అరికట్టాలనే అంశంపై వైద్యులు సూచనలు, సలహాలు చేశారు.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, మార్చి24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో ఫ్లైఓవర్ పనుల కారణంగా మల్లంపేట్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ ఉండదని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మల్లంపేట్ ఫీడర్ కేఆర్‌సీఆర్ కాలనీ, రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ వ్యాలీ, జెనిత్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 12:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ ఉండదు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరలించాలని అధికారులు కోరుతున్నారు.

## సేవా సమితి ఎన్నికల్లో ప్రచారం ప్రారంభించిన చింతల ప్యానల్



బొడ్రాయి దేవాలయం పూజల్లో పాల్గొన్న చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ ప్యానల్ సభ్యులు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: అంబర్‌పేట దేవస్థాన్ సేవా సమితి ఎన్నికల్లో సింహం గుర్తుపై పోటీ చేస్తున్న చింతల శ్రీనివాస్ ముదిరాజ్ ప్యానల్ సభ్యులు శుక్రవారం వివిధ బస్తీలలో ఓటర్లను కలుస్తూ ఓట్లును అభ్యర్థించారు. అంబర్‌పేట ప్రధాన రహదారిలో ఉన్న బొడ్రాయి (పోత లింగన్న) సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొడ్రాయి కిందకి రోడ్డుఎత్తులో ఉండటంతో వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోయి భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్యానల్‌ను గెలిపిస్తే బొడ్రాయి పున: నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ నుంచి పోటిచేస్తున్న ఉపాధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి కంచె చంద్రశేఖర్, కార్యదర్శి ఎడ్ల శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.సంజీవచారి, కోశాధికారి కూన అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ రపేయర్ డే సభకు అనుమతి ఇవ్వరాదు

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: ఏ ఒక్క క్రైస్తవునికి న్యాయం చేయకుండా తిరిగి ఎమ్మెల్సీ పదవి కోసం సిఎం కెసిఆర్‌ను మరోకసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న దర్పల్లి రాజేశ్వర్‌రావు నిర్వహించే నేషనల్ ప్రేయర్ డే సభకు అనుమతి ఇవ్వరాదని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కన్వీనర్ జెరుషాలెం మత్తయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2007లో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీగా, ఆతరువాత టిఆర్ఎస్ పార్టీలో చేరిన రాజేశ్వర్‌రావు రెండు సార్లు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి పొంది క్రైస్తవుల సమస్యలు పరిష్కారానికి ఏనాడు కృషి చేయలేదని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆయనపై క్రైస్తవ సమాజం తీవ్రంగా వ్యతిరేకత చూపుతున్నదని చెప్పారు. బిఆర్ఎస్‌ను బ్లాక్ మెయిల్ చేసే కుట్రతోనే ఏప్రిల్ 12వ తేదీన ఆయన నేషనల్ ప్రేయర్ డే పేరుతో సభ నిర్వహిస్తున్నారని, ఆ సభకు ఏలాంటి అనుమతి ఇవ్వరాదని ఆయన కోరారు.

## అదాని కేసును పక్కదారి పట్టించేందుకే రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దుయింది

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: అదాని కుంభకోణం కేసు పక్కదారి పట్టించడానికి రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు ఇ.టి. నర్సింహా ఆరోపించారు. ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బ్యాంకులను నిండా ముంచి అక్రమ పత్రాలతో దొల్ల కంపెనీలు సృష్టించి లక్షల కోట్ల రూపాయలను దోపిడి చేసిన అదానిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్ బయట, లోపల పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దీనికి సమాధానం చెప్పలేని ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చడానికే రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఆనేక మంది పార్లమెంట్ సభ్యులపై నేరపూరిత కేసులు నమోదయ్యాయని , కింది కోర్టులు వారికి శిక్ష విధించిన హైకోర్టులకు వెళ్ళి స్టే తెచ్చుకుని సభ్యులుగా కొనసాగుతున్నారని ఇందులో ఎక్కువ మంది బిజెపికి చెందిన ఎంపిలు, ప్రజాప్రతినిధులు కావడం గమనార్హం అని చెప్పారు.

## ముస్లింజంగ్ పూల్ సమీపంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్

బేగంబజార్, మార్చి 24ప్రభాతవార్త:ముస్లింజంగ్ పూల్ సమీపంలో షాహిద్ భగత్‌సింగ్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్, షాహిద్‌భగత్‌సింగ్ చైర్మన్, బిజెవైయం నాయకులు లడ్డుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీకి అనుమతి ఇవ్వాలి



నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్‌కు వినతి పత్రం అందచేస్తున్న ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

అఫ్జల్‌గంజ్, మార్చి 24 ప్రభాతవార్త: వీర్‌హన్‌మాన్ జయంతిన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 6వ తేదిన నిర్వహించే ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ నగర పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్‌ను భజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు కలిశారు. ఈమేరకు నగర పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. భజరంగ్‌సేనా ప్రతినిధులు రంజనీ, మనోజ్ పాల్గొన్నారు.

## మక్కామసీదులో యౌముల్ ఖురాన్ పఠనం సభ



యాకుత్‌పుర ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి ప్రసంగిస్తున్న దృశ్యం

చార్మినార్, మార్చి 24 ప్రభాతవార్త : పవిత్ర రంజాన్ మాసంలోని మొదటి శుక్రవారం సందర్భంగా మక్కా మసీదులో ఎంఐఎం ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ పఠనం సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఐఎం ప్రధాన కార్యదర్శి, యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి మాట్లాడారు.

**IN THE COURT OF THE HONBLE XVII SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**I.A.NO.3UUG 2022**
**IN**
**O.S.NO.12 OF 2021**

Between:
T.Suresh
...Plaintiff/Petitioner
AND
T.Devi Bai & Others
...Defendant/Respondent

To,
1 (D1) T.Devi Bai, W/o Late Sri T.Nageshwar Rao,Age about 52 years, Occ: House Wife, H.No.13-3-911, Indira Nagar, Jiyaguda, Hyderabad.
2. (D2) T.Naresh, S/o Late Sri T.Nageshwar Rao, Age about 52 years, Occ: Driver, H.No.13030911, Indira Nagar, Jiyaguda, Hyderabad.
3. (D3) T.Rakesh, S/o Late Sri T.Nageshwar Rao, Age about 52 years, Occ: Driver, H.No.13-3-911, Indira Nagar, Jiyaguda, Hyderabad.
4. (D5) Ms Anitha, D/o Late Sri T.Nageshwar Rao, Age about 52 years, Occ:Driver, H.No.13-3-911, Indira Nagar, Jiyaguda, Hyderabad.
5. (D8) Shaik Abdul Basheer, S/o. Late Shaik Rasheed, Age: about 36 years, Occ: Business, H.No.12-1-604/A/15, Syed Ali Guda, Asif Nagar, Hyderabad.
6. (D9) Shaik Abdul Nasheer, S/o Late Shaik Rasheed, Age about 31 years, Occ:Business, H.No.12-1-604/A/15, Syed Ali Guda, Asif Nagar, Hyderabad.
7. (D9) Shaik Abdul Nasheer, S/o Late Shaik Rasheed.

Take Notice that the Petitioner herein has filed the above Petition/Plaintiff Suit for Partition and Separate Possession and the Same is Posted 11.4.2023 for your notice & Appearance. Hende your hereby called upon to appear either in Person or through Advocate on 11.4.2023 at 10.30 Am before the Hon'ble Court lest the Matter would be decided as Per Law.

BY ORDER OF COURT
N.MURALIKRISHNA,
Advocate
H.No.13-6-625, Karwan,
Hyderabad-500006.

## ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : ప్రభుత్వవిప్ గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 24, ప్రభాతవార్త : వివేకానంద డివిజన్ పరిధిలో స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ నివాసం వద్ద శుక్రవారం కార్యర్తల సమావేశంలో స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందనగర్ డివిజన్‌లో ఆదివారం జరిగే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నేతలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక కార్పోరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు పురపాలక శాఖమంత్రి కెటిఆర్ పిలుపు మేరకు ఆదివారం ఉదయం 10గంటలకు అశోక గార్డెన్ పాపారాయుడు నగర్ నందు జరగబోయే వివేకానందనగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంకు రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎంపి ఆర్.రంజిత్‌రెడ్డిలు విచ్చేస్తున్నారని అన్నారు. కావున ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు అందరూ భాధ్యతగా తీసుకొని ప్రతి బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొనే విధంగా చేసి దిగ్విజయం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి సంజీవరెడ్డి, ఉద్యమకారులు డివిజన్ మెయిన్ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, పార్టీ కాలనీ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, మాజీ ఏరియా కమిటీ సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

## చార్మినార్ వద్ద చల్లని త్రాగు నీటి కేంద్రం ప్రారంభం



చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద చల్లని త్రాగు నీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ సుధీర్ బాబు

చార్మినార్, మార్చి 24 ప్రభాతవార్త : చార్మినార్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చల్లని త్రాగు నీటి కేంద్రాన్ని శుక్రవారం నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ జి.సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు చారిత్రక చార్మినార్‌ను తిలకించటానికి వచ్చే వేలాది మంది పర్యాటకుల దాహార్తిని తీర్చటానికి చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన చల్లని త్రాగు నీటి కేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. వేసవి కాలం సందర్భంగా మంచి నీటి కూలర్‌ను ఏర్పాటు చేసినందుకు ఆయన చార్మినార్ ట్రాఫిక్ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిసిపి-2 అశోక్ కుమార్, ట్రాఫిక్ అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు, చార్మినార్ ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్‌రావు, చార్మినార్ ట్రాఫిక్ సిఐ ఎస్.రవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అవధాన విద్యాప్రవీణులు తిరుపతి వెంటకవులు



దివాకర్ల తిరుపతిశాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జస్టిస్ నాగమారుతిశర్మ, దేవీప్రసాదరావు

చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త: తిరుపతి వెంటకవులుగా ప్రసిద్ధిపొందిన వారిలో ఒకరైన దివాకర్ల తిరుపతిశాస్త్రి అసాధారణ పండితులని సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలలో భాగంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దన మూర్తి అధ్యక్షతన దివాకర్ల తిరుపతిశాస్త్రి జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త రమణ వెలమకన్ని, పురాణపండ శ్రీనివాస్, ప్రముఖ సంఘసేవకులు ఎస్‌బి.రామ్, ప్రముఖ గాయకులు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగమారుతి శర్మ మాట్లాడుతూ చెల్లపిల్ల వెంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతిశాస్త్రి ఇరువురు తిరుపతిశాస్త్రి ఇరువురు తిరుపతి వెంకటకవులుగా ప్రసిద్ధులన్నారు. ఎందరోమహానుభావులు త్యాగరాజకీర్తన గ్రహించి చరిత్రలో ప్రసిద్ధులైన మహనీయుల జయంతులు జరుపుతూ వారిని సజీవంగా నిలుపుతున్న ఘనత త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తికే దక్కుతుందన్నారు.

## పీరంచెరువులో చలివేంద్రం



పీరంచెరువు కమాన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో తాగునీటిని అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, మార్చి 24 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని పీరంచెరువు కమాన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ప్రారంభించారు. అటుగా వెళ్తున్న వాహనదారులు, ప్రజలకు చల్లటి నీటిని అందించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజు రోజుకు ఉధృతమవుతుంద న్నారు. ఈ ఏడాది కాస్త ముందుగానే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడని, ప్రజలు తమ పనులను ఉదయం 8.నుంచి 11.గంటల లోపు సాయంత్రం 4గంటల తరువాత పనులు పెట్టుకొని ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రత వలన అనారోగ్యాల పాలయ్యే ప్రమాదముందని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. నీటిని ఎక్కువగా తీసుకోవాలని, కర్బూజ, తర్బూజ వంటి నీటి సాంద్రత ఎక్కువగా ఉండే పళ్లను తీసుకోవడం మంచిదన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రజలు, ప్రయాణీకులు, విద్యార్థులు, కూలీలకు ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు గాను దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆ ఎండలో చల్లటి తాగునీరు అమృతంలా అనిపిస్తుందన్నారు. మరింతమంది దాతలు ముందుకు వచ్చి ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి సాటి వారికి సహాయ పడాలని మేయర్ మహేందర్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పోరేటర్ సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఖాజా, రజాక్, ఇస్మాయిల్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లకుంట బిజెపి అధ్యక్షుడిగా రమణనాయుడు



బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు చేతుల మీదుగా నల్లకుంట బిజెపి డివిజన్ అధ్యక్షుడుగా నియామక పత్రం అందుకుంటున్న రమణానాయుడు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : బిజెపి నల్లకుంట డివిజన్ అధ్యక్షుడుగా మరోసారి ఎ.వి.రమణ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆపార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు చేతుల మీదుగా నల్లకుంట డివిజన్ అధ్యక్షుడుగా నియామక పత్రం అందుకున్నాడు. రమణనాయుడు ఇంతకు ముందు డివిజన్ అధ్యక్షుడుగా పనిచేసిన సీనియర్ నాయకుడు. ఈ సందర్భంగా రమణానాయుడు మాట్లాడుతూ డివిజన్‌లో బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి సంక్షేమ పనులు, బిజెపి పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లుతానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నల్లకుంట డివిజన్ నుంచి బిజెపికి అత్యధిక ఓట్లు సాధించేలా ఇప్పటి నుంచే దీర్ఘకాలిక కార్యక్రమాలు రూపొందించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో నల్లకుంట డివిజన్ అధ్యక్షుడుగా నియమించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ ఎన్.అమృతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### పిఆర్‌సి ప్రకటిస్తారని సిఎం కెసిఆర్‌పై విశ్వాసం ఉంది

**తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ శివాజీ**

హైదరాబాద్, మార్చి 24,ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతోపాటు ఉద్యోగులకు మంచి పిఆర్‌సి ప్రకటిస్తారని సిఎం కెసిఆర్‌పై పూర్తి విశ్వాసం ఉందని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ శివాజీ, అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్యలు ఓప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిఎం కెసిఆర్‌ను కలిసేందుకు టిజాక్ ప్రయత్నిస్తుందని త్వరలో సిఎంను కలిసి వేతన సవరనపై ప్రకటన వచ్చేవిధంగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

### ఆనందంగా ఐకమత్యంతో పండుగలు జరుపుకుందాం

**పీస్ కమిటీ సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి**




ధర్నాచౌక్, మార్చి 24, ప్రభా తవార్త: పండుగలను ఆనందం గా ఐకమత్యంతో కలసి, మెలసి జరుపుకుందామని చిక్కడపల్లి ఏసీపీ యాద గిరి పిలుపునిచ్చారు. శుక్రవా రం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చిక్కడపల్లి సబ్‌డి విజన్ పరిధిలోగల పీస్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైందని, త్వరలోనే శ్రీరామనవమి, హనుమాన్‌శోభాయాత్ర కూడా ఉన్నాయి కాబట్టి ఈ పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా, పోలీస్‌శాఖ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించినా, శాంతి భద్రతలకు ఏమైనా విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముషీరాబాద్, గాంధీనగర్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్లు జహంగీర్‌యాదవ్, మోహన్‌రావు, సంజయకుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా పనుల ప్రారంభం

**గోల్నాకలో అభివృద్ధి పనులను ప్రారంభించిన బిఆర్ఎస్ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్**



గోల్నాక, మారుతినగర్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బిఆర్ఎస్ నాయకుడు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : ఆయన ఎమ్మెల్యే కాదు.. స్థానిక కార్పొరేటర్ కూడా కాదు. ఓ ప్రజాప్రతినిధిలాగా ఓ బిఆర్ఎస్ నాయకుడు ఏకంగా గోల్నాక డివిజన్, మారుతి నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాడు. దీంతో ఆగ్రహించిన స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గోల్నాక డివిజన్, మారుతినగర్ బస్తీలో తనకు, సంబంధిత అధికారులకు ఎలాంటి సమచారం లేకుండా సురేష్ అనే వ్యక్తి కొంత మందితో కలిసి సిసి రోడ్డు పనులను ప్రారంభించారని ఫిర్యాదులో పేర్కొ న్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను ఎంపి, ఎమ్మెల్యే, కార్పొరే టర్లు అధికారుల సమక్షంలో ప్రారంభిస్తారని, అయితే ఇక్కడ సురేష్ అనే వ్యక్తి ప్రభుత్వ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించారని ఆరోపించా రు. వెంటనే అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## నిరుద్యోగ మహాధర్నాకు సర్వం సిద్ధం



మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ధర్నాచౌక్, మార్చి 24, ప్రభాతవార్త: బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన మా నౌఖరీలు మాగ్గావాలే పేరుతో నిరుద్యోగ మహాధర్నాకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీపన, నేతలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్.వీ.ఎస్.ఎస్.ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం శ్రమిస్తున్న నిరుద్యోగుల భవిష్యత్‌ను టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలతో కాలరాసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా యువత మద్దతు ఇస్తున్నారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్యాంసుందర్‌గౌడ్, గౌతంరావ్, రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.



పురానాపూల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ పర్యవేక్షించారు. ఆయన వెంట అధికారులు, మజ్లీస్ నాయకులు ఉన్నారు

# రాహుల్‌పై మోడీ రాజకీయ కక్ష సాధింపు : చల్లా



నిరసన దీక్ష చేస్తున్న నర్సింంహారెడ్డి, యెల్మేటి తదితరులు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : రాహుల్ గాంధీకి దేశ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి సహించలేక ప్రధాని నరేంద్రమోడీ రాజకీయ కక్ష సాధింపు చేస్తున్నారని రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింంహారెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ కోర్టులో రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించడాన్ని నిరసిస్తూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలోని జిల్లెలగూడ సంద చెరువు కట్టపై డిసిసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట మౌన దీక్ష నిర్వహించారు. అనంతరం కట్టపై మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింంహారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై సైతం ప్రశ్నించే గొంతులను నొక్కి వేయిస్తుందనడానికి పరువు నష్టం కేసులో రాహుల్‌కు జైలు శిక్ష విధించడమేనని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తెల్లముఖం వేసిన మోడీ కక్షసాధింపు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రధాని ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్ ప్రధాని అవుతారని ఆయన స్పష్టం చేశారు.

**రాహుల్‌కు అండగా కాంగ్రెస్ : యెల్మేటి అమరేందర్‌రెడ్డి**

అక్రమకేసులో జైలుశిక్ష పడ్డ రాహుల్‌గాంధీకి అండగా ఉంటామని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నిరసనకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మోడీ ఎన్ని కుతంత్రాలు చేసినా రాహుల్‌కు ప్రజల్లో ఆదరణను తగ్గించలేరన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధానకార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింంహారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు, భాగ్యనగర్ సొసైటీ వైస్ ఛైర్మన్ బంగారు బాబు, మీర్‌పేట్ కార్పొరేటర్లు చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, నాయకులు వంగేటి మధుసూదన్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, పుట్టగళ్ళ జగన్, కీసర యాదిరెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, సుభాన్ యాదవ్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఐతరాజు భాస్కర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి : చిగిరింత పారిజాత



వడ్డెర సంఘం జెండావిష్కరణకు హాజరైన మేయర్ పారిజాత

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త బిసిలుగా ఉన్న వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింంహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలాపూర్, మల్లాపూర్, సుల్తాన్‌పూర్‌లలో శుక్రవారం తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జరిగిన జెండావిష్కరణ కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ రాష్ట్రంలో 40లక్షల మందికి పైగా వడ్డెరలు ఉన్నా అన్ని రంగాల్లో వారు వెనుకబడి ఉన్నారని అన్నారు. ప్రభుత్వం తరపున వారికి సంక్షేమ కార్యక్రమాలు కూడా అందడం లేదని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో వారి ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింంహారెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నేనావత్ బాలు నాయక్, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, జెనిగె శ్రీనివాస్‌యాదవ్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు, ఎం.నాగేశ్, గండికోట యాదయ్య, పెద్ద యాదయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలి

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కొనసాగిస్తున్న ప్రగతి నివేదిత యాత్ర శనివారం ముగియనున్న నేపథ్యంలో పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగురోడ్డు సర్కిల్‌లో సాయంత్రం 3 గంటలకు సభను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిద్దంకి కృష్ణారెడ్డి,పాశం దామోదర్ తెలిపారు. ప్రగతి నివేదన సభకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ శాఖామాత్యులు కేటీఆర్ హాజరవుతారని వివరించారు. కార్యక్రమానికి మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సిపిఎం ఆధ్వర్యంలో జన చైతన్య యాత్రలు



జనచైతన్య యాత్ర పోస్టర్ అవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లాలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని సిపిఎం పార్టీ కార్యదర్శి ఎం.వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్, జె.వెంకన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న జన చైతన్య యాత్ర ఈనెల 28న జిల్లాలోకి ప్రవేశిస్తుందని, సాయంత్రం ఉప్పల్‌కు చేరుకుటుందని తెలిపారు. ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు స్వామి, ఎం.డి.గౌస్, ఎస్.నాగరాజు, వెంకటేశ్వర్లు, బీష్మచారి, వెంకటేష్, ఊర్మిల, కిరణ్‌కుమార్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ మీట్‌లో కార్పొరేటర్ల సందడి



స్పోర్ట్ మీట్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గీత ప్రవీణ్

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం శుక్రవారం సందడిగా సాగింది. నిత్యం ప్రజాక్షేత్రంలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న కార్పొరేటర్లు ఆటవిడుపులో భాగంగా పలు క్రీడలలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి కార్పొరేటర్లు పాల్గొన్నారని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. కార్పొరేటర్లు ఒకే వేదికపై వివిధ పోటీలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ మోతె శ్రీలతరెడ్డి, బన్నాల గీత ప్రవీణ్, బొంతు శ్రీదేవి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను గాలికి వదిలి వేసిన రాష్ట్ర ప్రభుత్వం : ఎన్వీఎస్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్

నాచారం, మార్చి 24 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం గాలిలికి వదలేసిందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. మల్లాపూర్‌లో శక్తి కేంద్ర సమ్మేళన కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజల పైనా పాలనపైనా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్దిలేదన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ఎలాంటి పశ్చాతాపం లేదన్నారు. భాధ్యులపై ఇంకా చర్యలు లేవన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌కె శ్రీనివాస్, బాలచందర్, రవినాయక్, వెంకటాచాలం, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, రవింద్ర సాగర్, గరిగే కృష్ణ, వెంకట్రావు, శ్రీనివాస్‌చారి, మంకాళి లక్ష్మణ్, సోమశేకర్‌గౌడ్, గోనె శ్రీకాంత్, మల్కా ప్రకాష్, దేవేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, అపర్ణగౌడ్, అనితారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రహ్లాద్‌శర్మకు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారాలను అందుకుంటున్న అర్చకులు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పురస్కారాలలో అర్చక విభాగంలో దిల్‌సుక్‌నగర్ మారుతి మందిర్‌లో అర్చకులు రొట్టె ప్రహ్లాదశర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. సిఎం కెసిఆర్ శాస్త్రీయంగా, సాంప్రదాయ పద్దతిలో దైవ కార్యాలను చేయడం అభినందనీయమన్నారు.

## పేదలకు ఆపన్న హస్తం : బిఎల్ఆర్



ఆర్థిక సహాయం అందిస్తున్న బిఎల్ఆర్ బృందం.

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : ఆపదలో ఉన్న నిరుపేదలకు బిఎల్ఆర్ ఆపన్న హస్తం అందిస్తుందని బిఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ మారుతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి తాళ్ల శ్రీనివాస్ తల్లి స్వర్గస్తుల అవడంతో పాటు కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన సమాచారం అందుకున్న ప్రతినిధి మహేష్ గౌడ్ పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పలుగుల మహేందర్ ఉపాధ్యక్షులు రవాణ పలుగుల సలహాదారులు మల్లయ్య, రమణ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధికి ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రిలో చికిత్స

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : ఆరునెలలుగా మొయామొయా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఒక యువతికి టిఎక్స్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా టిఎక్స్ ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో ఆసుపత్రి చీఫ్ అపరేషన్స్ ఆఫీసర్ డా.శ్రీకాంత్ వొడ్నాల మాట్లాడుతూ ఈ వ్యాధి బారిన పడిన వాళ్లకి తరుచూ మూర్ఛ రావడం, మొదడులో ఒక వైపు రక్తప్రసరణ తగ్గి శరీరం ఎడమ లేదా కుడిభాగంలో నీరసంగా ఉంటుందని తెలిపారు. వంశపార్యపరంగా సంక్రమించే ఈ జబ్బుని హైదరాబాద్‌లో అతి తక్కువ సంఖ్యలో ఆసుపత్రిలో మాత్రమే అందుబాటులో వైద్యం చేస్తారని తెలిపారు. డైరెక్ట్ వ్యాస్కులర్ అనస్టోమోసిస్ అనే క్లిష్టమైన ప్రక్రియ ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో చేరిన ఐదో రోజు ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ఏ ఇబ్బంది లేకుండా అన్ని పనులు చేసుకోవచ్చని తెలిపారు. ఆపరేషన్ చేసిన బ్రెయిన్ అండ్ స్పైన్స్ సర్జన్ డా.నరేష్‌కుమార్ గజ్జల, డా.ఏ.రాజేష్, అనస్తీషియన్ డా.అమర్నాద్‌రెడ్డి తెలిపారు. క్లిష్టమైన సర్జరీ చేసిన విజయవంతంగా చేయడం వల్ల ఈ వ్యాధితో ఇబ్బందిపడుతున్న వారికి టిఎక్స్ ఆసుపత్రి ధైర్యాన్నిచ్చిందని ఆసుపత్రి చీఫ్ అపరేషన్స్ ఆఫీసర్ డా.శ్రీకాంత్ వొడ్నాల తెలిపారు.

## రాహుల్‌గాంధీపై అనర్హత వేటు బిజెపి నియంతృత్వానికి నిదర్శనం : మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం బిజెపి నియంతృత్వానికి, అణిచివేతకు నిదర్శనమని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్‌సాక్షిగా ప్రశ్నించేగొంతును నొక్కివేసి రాహుల్ గాంధీపై అనర్హతవేటు వేయడం ప్రతిపక్షాలని అణిచివేసే కుట్రేఅని, ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పోవడం అన్నారు. జిల్లా కోర్టులో ఇచ్చిన తీర్పుకు 30 రోజుల గడువు ఇచ్చారు. ఈ 30 రోజులలో అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లే వెలుసుబాటు ఉన్నా కూడా అత్యవసరంగా అనర్హత వేటు వేయడం పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని బిజెపి ఖూనీ చేయడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరువు నష్టం కేసులో వేసిన శిక్షకి అనర్హత వేటు వేస్తే క్రిమినల్ కేసుల్లో శిక్షలు పడ్డ బిజెపి ఎంపీల మంత్రుల సంగతి ఏంటని ప్రశ్నించారు. ఎన్నో అవినీతి కేసులలో ఆరోపణలు ఎదుర్కొన్న బిజెపి నాయకుల కేసులను నీరుగార్చిన ఘనత బిజెపికే దక్కుతుందన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజల మద్దతు కూడగట్టుకున్న రాహుల్‌గాంధీని వచ్చే ఎన్నికలలో ఎదుర్కోలేక ఓటమి భయంతో బిజెపి చేస్తున్న కుట్ర అని వ్యాఖ్యానించారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



లబ్దిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు హబ్సిగూడలో లబ్దిదారుడు కిరణ్‌కుమార్‌కు రూ.52వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు ఈ పథకానికి దరఖాస్తు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయం



పాఠశాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త మానసిక వికలాంగ విద్యార్థుల కోసం పాఠశాలను ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని వీరభద్రనగర్‌కాలనీ ఫేజ్ -2లో శాంతినివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానసిక వికలాంగ పాఠశాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యంతో బాధపడకుండా విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. సంస్థ రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించాలని, తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం డివిజన్ పరిధి రంగనాయకులగుట్టలోని రంగనాయకుల స్వామి ఆలయాన్ని పరిశీలించిన ఆయన మౌళిక సదుపాయాలు కల్పించి ఆలయాన్ని అభివృద్ది చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, పారంద మహేష్, ఎర్రవెల్లి సత్యనారాయణ, జంగం పాల్గొన్నారు.

## స్పోర్ట్స్‌మీట్‌లో కార్పోరేటర్లతో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి



కార్పోరేటర్లతో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న డిప్యూటీ మేయర్

తార్నాక, మార్చి 24 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా నగర కార్పోరేటర్లతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి పాల్గొని వారిలో స్పోర్ట్స్ స్పిరిట్ నింపారు. ఆటలు ఒకరిపై ఒకరికి స్నేహాన్ని పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె చందానగర్‌లోని పిజేఆర్ ఇండోర్ స్టేడియంలో వివిద రకాల ఆటలను ఆడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు బొంతు శ్రీదేవి, బన్నాల గీత ముదిరాజ్, దేదీప్యరావు, మంజుల రెడ్డి, బనోత్ సుజాత, సమీనా బేగం, జోనకల్ కమీషనర్ శంకరయ్య, డీసీలు రమేష్, వేణుగోపాల్, దకు నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను కాపాడాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న సిద్దాల లార్డ్స్ బీరప్ప

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త అంతరించిపోకుండా భూగర్భజలాలను సంరక్షించుకోవాలని లార్డ్స్ గ్రూపు సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప పిలుపునిచ్చారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లెలగూడ లార్డ్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమం సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రతి నీటిబొట్టును కాపాడాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. జిల్లెలగూడ గాయత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ ప్రమోద్‌రెడ్డి, స్వాతి, లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికులకు మొదటి తారీకు రోజున జీతాలు ఇవ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రమేష్ తదితరులు

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు మొదటి తారీకు రోజే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్ ఆధ్వర్యంలో కమిషనర్ సాబేర్ ఆలికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న వనపర్తి బిజెపి ఇంచార్జి బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు నూటికి 95 శాతం దళిత వర్గాల ఉంటారని ప్రతి నెల మొదటితారీకునే జీతాలివ్వాలని, వారికి దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఐదున్నర లక్షల రూపాయల ఆర్థిక సహాయం, పిఎఫ్, ఇఎస్ఐ ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రామ్‌రెడ్డి, కొండ్రు పురుషోత్తం, కౌన్సిలర్ కదరి శ్రీలత, పలుస శ్రవణ్‌కుమార్, మైలారంబాబు, మాదుగుల బాలకృష్ణ, నాయకులు మల్లెల దేవేందర్, ఎల్మేటి నర్సింంహారెడ్డి, అజయ్‌గౌడ్, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి : డిసిపి రూపేష్‌కుమార్



డిసిపిని సన్మానిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : ఉత్సవాలు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి రూపేష్‌కుమార్ పేర్కొన్నారు. సౌత్ ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించినకార్యక్రమానికి ఆయన ముఖ్య అతి థిగా విచ్చేసి మాట్లాడుతూ రానున్న ఉత్సవాలు రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగలను శాంతి యుతంగా జరుపుకోవాలని పీస్ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం పీస్, ఆలయ కమిటీ కమిటీ డిసిపి రూపేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో ఏసిపి, ఇన్‌స్పెక్టర్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, డాక్టర్ ఉమారెడ్డి, మదన్‌బాబు, మజారుద్దీన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపాధి అవకాశాలు : చంద్రయ్యగౌడ్



విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేస్తున్న చంద్రయ్యగౌడ్

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల ఇంఛార్జి గౌని చంద్రయ్యగౌడ్ పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్‌లోని కళాశాలలో ఆయన ఆధ్వర్యంలో క్యాంపస్ జాబ్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించారు. జాబ్ రిక్రూట్‌మెంట్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్రో, హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్, టిఎస్‌వి ఇంజనీరింగ్, తదితర సంస్థల ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. కళాశాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రేమలత, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం



మోడీ దిష్టిబొమ్మను దహనం చేసిన పెద్దబావి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త :ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల ద్వారా శిక్షలు వేయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో రాజకీయ కక్షలకు పాల్పడుతున్న ప్రధాని మోడీ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింంహారెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింంహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, పన్నాల రాజేందర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## శివసుధీర్‌శర్మకు ఉగాది నంది పురస్కారం

ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త : శోభకృత్ ఉగాది నంది పురస్కారం సుధీర్‌శర్మ అందుకోనున్నారు. మారుతి నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు, పనిగిరికాలనీ శ్రీహనుమత్ ప్రత్యంగిరా దేవస్థానం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ గుండెపూడి శివసుధీర్‌శర్మకు జ్యోతిష్య బ్రహ్మ నంది అవార్డును ఈనెల 26వ తేదీన కళానిలయం సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డును ప్రధానం చేయనున్నారు. ఇండియన్ ఐకాన్ లాంటి అవార్డులను కూడా అందుకున్న శివసుధీర్‌శర్మకు నంది అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వేలాడుతున్న కేబుల్ వైర్లతో ఇబ్బందులు : శ్రీవాణిఅంజన్



వినతి పత్రం చూపిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త : విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లు ప్రమాదకరంగా మారాయని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న కేబుల్, ఇంటర్‌నెట్ వైర్ తొలగించాలని జిహెచ్‌ఎంసి సెక్రెటరీకి శుక్రవారం కార్పొరేటర్ వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న వైర్లతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్‌నెట్ కేబుల్‌వైర్లను నిర్మించాలని కోరుతూ జిహెచ్‌ఎంసి మేయర్, మున్సిపల్‌శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వేలాడుతున్న వైర్లతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోయినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు ముందు జాగ్రత్తలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల అంజన్‌కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్ రూం ఇళ్ళ కాలనీకి నీటి సరఫరా చేయాలని వినతి



సబితారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ నీలారవినాయక్

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 29వ డివిజన్‌లోని లెనిన్‌నగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ళకాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కార్పొరేటర్ రాత్లావత్ నీలా రవినాయక్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంత్రికి స్థానిక సమస్యలను వివరించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళ వద్ద మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ఈ నేపథ్యంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచి నీటి సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మధ్యలో ఆగిన డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేయించి మిగతా లబ్ధిదారులకు ఇవ్వాలని ఆమె కోరారు. అదే విధంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు కూడా కార్పొరేటర్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రవినాయక్, స్థానికులు పాల్గొన్నారు.

## గాయత్రినగర్ ఫేజ్-4లో కాలనీవాసుల శ్రమదానం

### స్వంత నిధులతో మరమ్మతులు



గాయత్రినగర్ ఫేజ్-4 రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీల ప్రజలు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, అభివృద్దికి నోచుకోవడంలేదు. పన్నులు వసూలు చేస్తున్నారే తప్ప మౌలిక వసతులు లేక శివారు కాలనీల ప్రజలు ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. మట్టిరోడ్లు గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు నిధులు సమకూర్చుకుని రోడ్డు లెవల్ చేయించుకున్నారు. వివరాల్లోకి వెళితే బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ ఫేజ-4 కాలనీలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు సుమారు లక్ష రూపాయల నిధులు సమకూర్చుకుని గాయత్రీ నగర్ కమాన్ మెయిన్ అప్రోచ్ రోడ్డును మరమ్మతు చేసుకున్నారు. గుంతల్లో మట్టి పోసి జెసిబితో లెవల్ చేయించుకున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి గాయత్రినగర్ ఫేజ్-4లో డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బాలాంత్రపు సుధాకర్, యజ్ఞమూర్తి, రవికిరణ్, వెంకటేష్, లక్కరాజు అర్జున్‌నాగలక్ష్మి పాల్గొన్నారు.

## కాలనీవాసులు చెత్తను రోడ్లపై వేయవద్దు : కార్పొరేటర్ పవన్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్.బి.నగర్,మార్చి 24 ప్రభాతవార్త : కాలనీవాసులు చెత్తను రోడ్లపై వేయవద్దని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ భరత్‌నగర్ ఫేస్ 2లో శానిటైజేషన్ అధికారులతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు స్వచ్ఆటోలలో మాత్రమే చెత్త వేయాలని కోరారు. చెత్త రోడ్లపై వేయడం వల్ల వ్యాధుల ప్రమాదం ఉంటుందన్నారు. కాలనీ శుభ్రంగా ఉండేవిధంగా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య, రాంకీ, భరత్, లక్ష్మయ్య, చిరంజీవి, ప్రేమ్, శివ, అఖిల్, విజయభారతి, నాయకులు కోర్లపల్లి స్వామి, వెంకటేష్, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.